సాక్షి నల్లగొండ

గురువారం । 12 । జూన్ । 2025



బాలుడి ఆచూకీ లభ్యం

నల్లగొండ ఆస్పత్రిలో కిడ్నాప్‌కు గురైన బాలుడి ఆచూకీని పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. - 8లో



రైతు భరోసా అందడం లేదు

రాష్ట్రంలో రైతు భరోసా సకాలంలో అందడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆరోపించారు. - 10లో



ఎల్లంపల్లి నుంచే..

గంధమల్ల రిజర్వాయర్‌కు ఎల్లంపల్లి నుంచి నీటిని తీసుకొస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది. - 10లో

న్యూస్‌రీల్

12 నుంచి 'ఇగ్నో' పరీక్షలు

రామగిరి(నల్లగొండ) : జూన్ 12వ తేదీ నుంచి ఇగ్నో ఓపెన్ యూనివర్సిటీ పరీక్షలు ప్రారంభం కానున్నాయని కాకతీయ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహ్మారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి ఒంటి గంటల వరకు నల్లగొండలోని కాకతీయ కళాశాలలో పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రానికి అర గంట ముందే అభ్యర్థులు రావాలని సూచించారు.

'భగీరథ' పనుల పరిశీలన



అడవిదేవులపల్లిలో జల భగీరథ పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండలంలో ఉపాధి హామ పథకం చేపట్టిన 'జల సంచాయి–జల భగీరథ' పనులను బుధవారం కేంద్ర బృందం పరిశీలించింది. దాంతోపాటు కేంద్ర బృందం సభ్యులు అడవిదేవులపల్లి, ఉల్సాయిపాలెం, కొత్తనందికొండ, ములకచర్ల, బాల్నేపల్లి, చిట్యాల తదితర గ్రామాల్లో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను 18 ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీడబ్ల్యూసీ ఇంజనీర్ సంతోష్ ఆధ్వర్యంలో ఈ పరిశీలన సాగింది. కేంద్ర బృందం వెంట క్లస్టర్ ఏపీడీ బాలకృష్ణ, ఎంపీడీఓ మాతంగి రమేష్, ఎంపీఓ సూరానాయక్, టెక్నికల్ అసిస్టెంట్లు చారి, రాధ, వినోద్ తదితరులు ఉన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

తిప్పర్తి : రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం తిప్పర్తి మండలంలోని సర్వారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 566 రెవెన్యూ గ్రామాల్లో ఈనెల 3వ తేదీ నుంచి సదస్సులు నిర్వహిస్తున్నామని.. ఇప్పటి వరకు 15వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. తిప్పర్తి మండలంలో రెవెన్యూ సదస్సులు ముగిశాయని.. మండల వ్యాప్తంగా మొత్తం 939 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

సైబర్ నేరగాళ్లపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ఏఎస్పీ మౌనిక

మర్రిగూడ : ప్రజలకు సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని దేవరకొండ ఏఎస్పీ మౌనిక అన్నారు. బుధవారం మర్రిగూడ పోలీస్‌స్టేషన్‌ను ఆమె సందర్శించి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువర్గాలను పిలిపించి భూములకు సంబంధించిన సమస్యలను రెవెన్యూ కార్యాలయంలో పరిష్కరించుకోవాలని సూచించారు. దారి సమస్యలు ఉంటే సర్వేయర్ ద్వారా హద్దురాళ్లు పెట్టుకుని తగాదాలకు తావు లేకుండా ఉండాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు 1930 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో నాంపల్లి సీఐ డి.రాజు, ఎస్‌ఐ ఎం.కృష్ణారెడ్డి, సిబ్బంది సైదులు, వాహిద్, సత్యనారాయణ, శిరీష, గీత, రత్నం, కోటేష్, హుస్సేన్ ఉన్నారు.

ఆయిల్‌పామ్ గెలల సేకరణ కేంద్రం ప్రారంభం

కనగల్ : కనగల్ మండల కేంద్రంలో ఆయిల్ పామ్ గెలల సేకరణ కేంద్రాన్ని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి పిన్నపురెడ్డి అనంతరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనగల్ మండలంలో రైతులు 350 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగును చేస్తున్నారని తెలిపారు. 2021 – 22 సంవత్సరం నుంచి ఎన్‌ఎంఈఓపీ కింద 80 శాతం రాయితీపై ఆయిల్‌పామ్ మొక్కలు అందిస్తున్నామన్నారు. నాలుగు సంవత్సరాల వరకు నిర్వహణ ఖర్చుల కింద ఎకరాకు రూ.4,200 చొప్పున రైతు ఖాతాల్లో జమ చేస్తామని.. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పతాంజలి ఫీల్డ్ ఆఫీసర్ ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ శివాజీ పాల్గొన్నారు.

బడికి వేళాయే..

నేడు పాఠశాలలు పునః ప్రారంభం

- ప్రభుత్వ స్కూళ్లను ముస్తాబు చేయించిన విద్యాశాఖ
- వేసవి సెలవుల్లో ఆటపాటలతో గడిపిన బాలలు.. ఇక బడికి పయనం



మిర్యాలగూడ పట్టణం విద్యానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మామిడి తోరణాలు కడుతున్న సిబ్బంది

నల్లగొండ : బడి గంట వేళయింది. ఇన్ని రోజులు వేసవి సెలవుల్లో ఆటపాటలతో గడిపిన విద్యార్థులు నేటి నుంచి బడిబాట పట్టనున్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ యాజమాన్యాల కింద 1483 పాఠశాలలు ఉన్నాయి. అవి గురువారం నుంచి పునః ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ పాఠశాలను ఇప్పటికే శుభ్రపరిచి ప్రారంభానికి సిద్ధం చేశారు. పాఠశాలలు పునః ప్రారంభాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఇప్పటికే ఆయా మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పాఠశాలలను తోరణాలు, బెలూన్లతో అలంకరించనున్నారు.

పుస్తకాలు, యూనిఫామ్ సిద్ధం

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో చదవే విద్యార్థులకు పాఠశాల ప్రారంభం రోజునే యూనిఫామ్‌తోపాటు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందించేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే వాటిని విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆయా పాఠశాలలకు చేర్చారు. మొదటి రోజే విద్యార్థులకు వాటిని అందించనున్నారు.



రామగిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల భవనం శుభ్రం చేస్తున్న సిబ్బంది

కొండమల్లేపల్లి పాఠశాల ప్రత్యేకం



కొండమల్లేపల్లి : జిల్లాలో కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఈ పాఠశాలలో విద్యనభ్యసించడానికి విద్యార్థులు పోటీ పడుతుంటారు. కొండమల్లేపల్లి నాలుగు రోడ్ల కూడలి కావడం, చుట్టుపక్క మండలాల నుంచి కూడా అడ్మిషన్లు రావడమే కాక ఉత్తమ బోధన, పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించడం, ఇక్కడ విద్యను అభ్యసించిన వారు ఉన్నత స్థానాల్లో ఉండడం కారణాలుగా చెప్పవచ్చు. ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే అత్యధిక విద్యార్థులు నమోదు కలిగిన పాఠశాలగా కొండమల్లేపల్లికి పేరు సాధించింది. కొండమల్లేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో గత సంవత్సరం 956 మంది విద్యార్థులు ఉన్నారు. 54 మంది ఉపాధ్యాయులు ఈ పాఠశాలలో విద్యను బోధిస్తున్నారు. క్రమ శిక్షణకు మారుపేరుగా ఉన్న ఈ పాఠశాలలో పలు పోటీ పరీక్షల్లో కూడా విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించడం ఉపాధ్యాయుల ఉత్తమ బోధనకు నిదర్శనంగా చెప్పవచ్చు. ఈ పాఠశాల సైన్స్ ప్రయోగాలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, క్రీడల్లో ప్రత్యేక శిక్షణ కూడా ఉండడంతో పాఠశాలలో చేరడానికి విద్యార్థులు పోటీ పడుతుంటారు. జిల్లాలోనే అత్యధిక విద్యార్థుల నమోదు ఈ పాఠశాలలో ఉండడంతో జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడం కూడా ఈ పాఠశాల అభివృద్ధికి ప్రధాన కారణమని చెప్పవచ్చు.

గుణాత్మక విద్య అందిస్తాం

- ఉపాధ్యాయులకు వేసవిలో వృత్యంతర శిక్షణ పూర్తి చేశాం
- ఈసారి అన్ని పాఠశాలల్లో ఏఐ బోధన
- విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా బడిబాట నిర్వహిస్తున్నాం
- విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల పరిధిలో స్పెషల్ డ్రైవ్ చేపడతాం

'సాక్షి' ఇంటర్వ్యూలో డీఈఓ భిక్షపతి



ఇంటర్వ్యూలో మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

నల్లగొండ : 'ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు గుణాత్మక విద్యను అందిస్తాం. నూతన పద్ధతిలో సాంకేతికతతో కూడిన బోధన చేసే విధంగా ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ఇచ్చాం. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా బడిబాట కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది నుంచి అన్ని స్కూళ్లలో ఏఐ బోధన ప్రారంభిస్తాం' అని డీఈఓ భిక్షపతి అన్నారు. గురువారం పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా ఆయన 'సాక్షి' ఇంటర్వ్యూలో మాట్లాడారు.

పాఠశాలలు పునః ప్రారంభానికి అన్ని చర్యలు తీసుకున్నాం. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో ఇప్పటికే శుద్ధీకరణ పనులు చేయించాం. శానిటేషన్‌తో పాటు మధ్యాహ్న భోజన వంట పాత్రలు శుభ్రం చేయించాం. బడి ఈడు పిల్లలందర్ని బడిలో చేర్పించే విధంగా జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రుల నుంచి కూడా మంచి స్పందన వస్తోంది. గతంలో కంటే ఈసారి అడ్మిషన్లు పెరిగే అవకాశం ఉంది. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాం. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు వివరించి పిల్లలు అధిక సంఖ్యలో చేరే విధంగా చర్యలు తీసుకుంటారు.

మొదటి రోజే పుస్తకాలు, యూనిఫాం..

పాఠశాల తెరిచిన రోజునే విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేస్తాం. పాఠశాలలు ప్రారంభమైన మొదటి పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహిస్తాం. మొదటి రోజున ఉపాధ్యాయులు తప్పనిసరిగా పాఠశాలకు హాజరుకావాలి. తోరణాలు, బెలున్లతో పాఠశాలను అలంకరించుకుని గ్రామంలోని ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, యువతను ఆహ్వానించి సమావేశం నిర్వహించాలి. ఏ పాఠశాలలోనైతే జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉందో, తక్కువ విద్యార్థులు ఉన్నారో ఆ పాఠశాల పరిధిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం. ఎంఈఓలు, హెడ్మాస్టర్లు, సీఆర్‌పీలు ఆ పాఠశాలలను తిరిగి తెరిచే విధంగా చర్యలు తీసుకుంటారు.

13వ తేదీన సామూహిక అక్షరాభ్యాసం..

13వ తేదీన బాలసభ నిర్వహించి సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విద్యపై అవగాహన, డ్రాయింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. 16వ తేదీన పాఠశాలలో లెర్నింగ్ ఇంప్రూమెంట్ నేర్పిస్తారు. అదే విధంగా ఫన్ స్టోరీలు నేర్పిస్తారు. 17వ తేదీన పాఠశాలల్లో గర్ల్స్ చైల్డ్ ఫంక్షన్ నిర్వహిస్తున్నాం. యాక్టివిటీ విధానంలో బోధన జరిగేలా ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికలు సిద్ధం చేస్తారు. ఎన్‌రోల్‌మెంట్ ఎక్కువగా అయిన పాఠశాలల్లో ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహిస్తాం.

అన్ని పాఠశాలల్లో ఏఐ అమలు..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కలెక్టర్ ఆమోదంతో ఈ విద్యా సంవత్సరం నుంచి ఏఐ పాఠాలు అమలు చేయబోతున్నాం. ఇది పిల్లలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. సంవత్సరం పదో తరగతి విద్యార్థుల తరహాలోనే ఈ సారి 6వ తరగతి నుంచే విద్యార్థులకు ప్రత్యేకంగా స్టడీ అవర్ పెట్టాలన్న ఆలోచనలో ఉన్నాం. కలెక్టర్ ఇలా త్రిపాఠి సలహాలు, సూచనలతో రాష్ట్ర స్థాయిలో ఇచ్చే కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తూ విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్య అందించేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు పోతాం.

స్కూల్‌కు నడుచుకుంటూ వెళ్లే వాడిని

- ఎన్.శంకర్, సినీ డైరెక్టర్



మాడ్గులపల్లి: మాది చిరుమర్తి గ్రామం. నేను మా గ్రామం నుంచి ఆగామోత్కూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు రోజూ టిఫిన్ బాక్స్ పట్టుకోని నడుచుకుంటూ వెళ్లే వాడిని. ఆ పాఠశాల నిజాం కాలం నాడు కట్టించింది. ఆ పాఠశాలలో నేను పదో తరగతి వరకు చదువుకున్నాను. పదో తరగతి వార్షిక పరీక్షలో నేను మండల ఫస్ట్ ర్యాంకు సాధించాను. పాఠశాలలో నా స్నేహితులతో కలిసి బాగా ఆడుకునేవాడిని. ఆగామోత్కూర్ పాఠశాలలో చదువుకున్న వారు నేడు ఆయా రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. అదేవిధంగా టీచర్లు, ఎంఈఓలు, విద్యాశాఖ డైరెక్టర్లు కూడా అయ్యారు.

ఇందిరమ్మ ఇళ్ల పనుల జాబితా సమర్పించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : ఇందిరమ్మ ఇళ్ల పనులు ఏస్థాయిలో ఉన్నాయో జాబితాలను సంబంధిత శాఖల ఇంజనీరింగ్ అధికారులు సమర్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం ఆమె తన చాంబర్‌లో ఇందిరమ్మ ఇళ్లు, ఇరిగేషన్ ప్రాజెక్టులు, మిషన్ భగీత కేంద్రాల నిర్మాణం, ప్రభుత్వ పనులకు ఇసుక సరఫరాపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణాలకు అవసరమయ్యే ఇసుకను తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా సరఫరా చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు స్థానిక వాగుల నుంచి నేరుగా ఇసుకను తీసుకోవద్దని, ముందుగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఆయా మండలాల వారీగా ఇసుక లభ్యమయ్యే వనరుల జాబితా సమర్పించాలని జిల్లా మైనింగ్ అధికారిని ఆదేశించారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణ పనుల వివరాలను సమర్పించాలని జిల్లా ఇరిగేషన్ అధికారికి సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, జిల్లా మైనింగ్ అధికారి శామ్యూల్ జాకబ్, గృహ నిర్మాణ సంస్థ పీడీ రాజ్‌కుమార్, జిల్లా ఇరిగేషన్ అధికారి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమం, పార్టీ అభివృద్ధే ముఖ్యం

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు : రాష్ట్ర ప్రజల సంక్షేమం, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధే తనకు ముఖ్యమని, తాను ఏ రోజూ పదవుల కోసం పాకులాడలేదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. కొంతకాలంగా మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి వస్తుందని భావించగా ఇటీవల ప్రభుత్వం ముగ్గురికి మంత్రి పదవులకు ఎంపిక చేసింది. కానీ రాజగోపాల్‌రెడ్డికి పదవి దక్కలేదు. దీంతో ఆయన రెండు రోజుల పాటు ఎవ్వరితోనూ టచ్‌లో లేకుండా తన ఫాం హౌస్‌లో విశ్రాంతి తీసుకున్నారు. మంత్రి పదవిపై ఏవిధంగా స్పందిస్తారని అందరూ ఉత్కంఠతో చూశారు. అయితే బుధవారం తన మనస్సులో మాటను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. నూతనంగా మంత్రి పదవులు పొందిన ముగ్గురికి శుభాకాంక్షలు తెలియజేస్తూ.. తనకు పదవి రాలేదని ఎక్కడా బాధపడడం లేదని, పదవి ఉన్నా లేకనపాయినా ప్రజల కోసం పనిచేసని.. అదే తనకు ఎంతో శక్తిని ఇస్తుందని పేర్కొన్నారు. జీవితాంతం రాజకీయాల్లో ఉంటూ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు.

68,70,800 మొక్కలు నాటడమే లక్ష్యం

- స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్



మాట్లాడుతున్న నారాయణ్ అమిత్

నల్లగొండ : వనమహోత్సవం కింద జిల్లాలో 68,70,800 మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ వెల్లడించారు. వనమహోత్సవ కార్యక్రమంపూ బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నాటనున్న 68,70,800 మొక్కల్లో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు 39,51,700 వ్యవసాయ శాఖ 7,66,000, ఉద్యాన శాఖ 6,38,000, మున్సిపాలిటీలు 8,20,00 మొక్కలు నాటేందుకు లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. జిల్లా అటవీశాఖ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ వన మహోత్సవం కింద ఆయా శాఖలు వారికి నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించడమే కాకుండా, జియో ట్యాగింగ్ చేయాలని, నర్సరీలను మ్యాచింగ్, బ్యాచింగ్ చేయాలని తెలిపారు. జిల్లా విద్యాశాఖ ప్రతి పాఠశాలలో మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్, ఎక్సైజ్ అధికారి సంతోష్, డీఈఓ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి



ఏపీ లింగోటంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నార్కట్‌పల్లి : భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం నార్కట్‌పల్లి మండలంలోని ఏపీ లింగోటం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆమె హాజరై రైతులతో మాట్లాడి.. భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యలు రైతులు దరఖాస్తు చేసుకోవాలని, ఒకవేళ రెవెన్యూ సదస్సులకు హాజరు కాలేకపోతే ఈనెల 20వ తేదీ వరకు నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించవచ్చని స్పష్టం చేశారు. భూ సమస్యల పరిష్కారంలో భాగంగా చట్ట ప్రకారం వెసులుబాటు ఉంటే రైతులకు మేలు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరావు, అధికారులు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పెద్దవూర : వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి(డీటీడీఓ) చత్రు నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల, ఎస్టీ రెగ్యులర్ హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా పరిసరాలలో బ్లీచింగ్ ఫౌడర్ చల్లాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని తెలిపారు. వసతిగృహాల్లో మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సూచించారు. త్వరలోనే విద్యార్థులకు నోట్‌బుక్స్, యూనిఫాం పంపిణీ చేస్తామని తెలిపారు.

ఊరూరా.. అంగన్‌వాడీ బాట

- 17వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- రెండున్నరేళ్లు దాటిన పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించేలా ప్రణాళిక



మిర్యాలగూడ పట్టణంలోని ఓ కేంద్రంలో ర్యాలీని ప్రారంభిస్తున్న సీడీపీఓ

మిర్యాలగూడ టౌన్ : రెండున్నరేళ్లు నిండిన పిల్లలను తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరుతూ 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' పేరుతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అంగన్‌వాడీల్లో పిల్ల పెంపే లక్ష్యంగా ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. ఈనెల 17వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. అంగన్‌వాడీ స్థాయి పర్యవేక్షణ, సహాయ కమిటీ బృందాలు పిల్లల నమోదును పెంచేందుకు ఎంతో కృషి చేస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా అనముల, చింతపల్లి, దామరచర్ల, దేవరకొండ, నల్లగొండ, మిర్యాలగూడ, మునుగోడు, కొండమల్లేపల్లి, నకిరేకల్ ప్రాజెక్టుల పరిధిలో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

ప్రత్యేక కార్యక్రమాలు ఇలా..

- అంగన్‌వాడీలు, ఎన్‌జీఓ సంఘాలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పోషణ్ అభియాన్ సిబ్బంది ర్యాలీల నిర్వహణ.
- పట్టణ, గ్రామీణ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం.
- పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న సౌకర్యాలను వివరించి వారిని ప్రోత్సహించడం.
- అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువు పూర్తయిన పిల్లలకు సర్టిఫికెట్లు అందించి. వారు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ప్రోత్సహించడం.
- స్వచ్ఛ అంగన్‌వాడీ కార్యక్రమం పేరుతో కేంద్రాలను శుభ్రం చేయడం.
- అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాల్లో మొక్కలను నాటడం.
- సామూహిక అక్షరభ్యాసం నిర్వహించడం.
- పిల్లలకు పాఠాలు, టైం టెబుల్, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు తదితర అంశాలపై అవగాహన కల్పించడం.
- స్టడి మెటీరియల్‌ను పంపిణీ చేయడం.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత

దేవరకొండ: అక్రమంగా తరలిస్తున్న 30క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని దేవరకొండ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం దేవరకొండ మండలం ఎల్లారెడ్డిబావి నుంచి బొలెరో వాహనంలో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కల్వకుర్తి వైపు తరలిస్తుండగా సమాచారం మేరకు వాహనాన్ని పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అస్వస్థతకు గురై వలస కార్మికుడు మృతి

చౌటుప్పల్ : వలస కార్మికుడు అస్వస్థతకు గురైన మృతిచెందాడు. ఈ ఘటన చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శ్రీని ఫార్మాస్యూటికల్ కంపెనీలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఝార్కండ్ రాష్ట్రం వెస్ట్‌సింగ్‌భుం జిల్లా, మంజరి మండలం, బారాలగ్రా గ్రామానికి చెందిన కృష్ణ(39) జీవనోపాధి నిమిత్తం 40రోజుల క్రితం పట్టణంలోని శ్రీని ఫార్మా కంపెనీకి వచ్చాడు. పరిశ్రమలో కూలీ పని చేస్తూ అక్కడే ఉన్న కంపెనీ క్వార్టర్స్‌లో సహచరులతో కలిసి ఉంటున్నాడు. ఒళ్లు, కాళ్లనొప్పులు ఉన్నాయని గత రెండు రోజులుగా పనికి వెళ్లకుండా గదిలోనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈక్రమంలో బుధవారం ఉదయం సమయంలో ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పడంతో సహచరులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి అల్లుడు మహేంద్రపాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

బంగారం చోరీ కేసులో వ్యక్తికి జైలు

చివ్వెంల(సూర్యాపేట) : బంగారం చోరీ కేసులో వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి అపూర్వ రవళి బుధవారం తీర్పు వెల్లడించారు. అర్వపల్లి మండలం కొమ్మాల గ్రామానికి చెందిన సూరారపు తిరుమలేష్ 2016లో సూర్యాపేట పట్టణంలో మూడు ఇళ్లలో చొరబడి, బంగారం అపహరించాడు. బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ మొగిలయ్య కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్ చేశారు. పీపీ బి.హేమలత నాయుడు వాదనలతో ఏకీభవిస్తూ, పలువురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి నిందితుడికి ఒక్కో కేసులో 5 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పీపీకి కోర్టు కానిస్టేబుల్ పత్తిపాక వెంకటేశ్వర్లు సహకరించారు.

నీటిపారుదల శాఖ జేఈఈ ఆత్మహత్య



జేఈఈ దేవిలాల్(ఫైల్)

బయ్యారం: నీటిపారుదల శాఖ జేఈఈ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కాపువారిగూడెం గ్రామానికి చెందిన పానుగోత్ దేవిలాల్(34) ఇరిగేషన్ శాఖలో జేఈఈగా గార్ల మండలంలో పనిచేస్తున్నాడు. దేవిలాల్ దివ్యాంగుడు. బయ్యారంలో గది అద్దెకి తీసుకొని ఉంటున్నాడు. ఈ క్రమంలో దేవిలాల్ బుధవారం రాత్రి తన గదిలో పురుగులమందు తాగగా.. గమనించిన చుట్టుపక్కల వారు అతడిని చికిత్సనిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. జేఈఈ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

బాలుడి ఆచూకీ లభ్యం

- కిడ్నాప్ కేసును 7 గంటల్లోనే ఛేదించి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శివరాంరెడ్డి



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న డీఎస్పీ

నల్లగొండ: నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కిడ్నాప్‌కు గురైన బాలుడి ఆచూకీని పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. హైదరాబాద్‌లోని దమ్మాయిగూడకు చెందిన నారాయణదాస్ అరుణ, జంతిక చుక్కమ్మ అలియాస్ (పాలడుగు సుగుణమ్మ) ఈ కిడ్నాప్‌కు పాల్పడినట్లు గుర్తించారు. బుధవారం నల్లగొండ ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ శివరాంరెడ్డి వివరాలు వెల్లడించారు. మిర్యాలగూడ మండలం తుంగపహాడ్‌కు చెందిన బైరం భాగ్యలక్ష్మి 8 నెలల గర్భిణి. రెండో కాన్పు కోసం నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి ఈ నెల 8వ తేదీన భర్త అంజిబాబు, కుమారుడు సోమేష్‌తో కలిసి వచ్చింది. వారి వెంట ఇంటి పక్కన ఉండే కుంచం పార్వతమ్మ కూడా ఆస్పత్రికి వచ్చింది. భాగ్యలక్ష్మి లేబర్ వార్డులో చేరింది. అప్పటి నుంచి ఆమె బాగోగులు పార్వతమ్మ చూస్తోంది. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రభుత్వ ఆస్పత్రి ముందు ఉన్న ప్రసూతి విభాగం ఎదుట భాగ్యలక్ష్మి తన కుమారుడు సోమేష్, వెంట వచ్చిన పార్వతమ్మ చెట్టు కింద కూర్చున్నారు. అక్కడే ఉన్న ఇద్దరు గుర్తు తెలియని మహిళలు వారితో మాటలు కలిపి పరిచయం పెంచుకున్నారు. బాలుడిని ఆడిస్తున్నట్లుగా చేసి, మీరిద్దరూ భోజనం చేసి రండి బాలుడిని చూసుకుంటాం అని చెప్పడంతో వారు భోజనానికి వెళ్లారు. అదే అదునుగా భావించిన మహిళలు బాలుడిని కిడ్నాప్ చేశారు. తిరిగి వచ్చేసరికి బాలుడితో పాటు ఇద్దరు మహిళలు కనిపించలేదు. దీంతో టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో పార్వతమ్మ ఫిర్యాదు చేసింది. ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీలు పరిశీలించడంతో పాటు ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లతో పాటు జిల్లా వ్యాప్తంగా వాహనాలు తనిఖీ చేశారు. గుండాల మండలం పెద్దపడిశాల గ్రామంలోని ఏ1 నారాయణదాసు అరుణ తల్లి ఇంటి వద్ద వీరిద్దని పట్టుకుని బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. బాలుని కిడ్నాప్ కేసును ఏడు గంటల్లోనే ఛేధించి, నిందితులను పట్టుకున్న టూటౌన్ సీఐ రాఘవరావు నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, టూటౌన్ ఎస్ఐ సైదులు, సతీష్, భువనగిరి సీఐ రమేష్, పోలీసులు రాజు, సాగర్ల శంకర్, జానకిరామ్, తిరుమలేష్‌లను ఎస్పీ అభినందించారు.

కిడ్నాప్‌కు గల కారణాలు..

నారాయణదాసు అరుణకు కుమారుడు. కుమార్తె ఉన్నారు. సంవత్సరం క్రితం కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మగ పిల్లలపై ప్రేమతో ఏ విధంగా నైనా బాలుడిని పెంచుకోవాలని అనుకుంది. ఈవిషయాన్ని దమ్మాయిగూడెంలో తాను నివసిస్తున్న ఇంటి పక్కన గల మరో మహిళ జంతిక సుక్కమ్మ అలియాస్ (పాలడుగు సుగుణమ్మ)తో చెప్పింది. ఇద్దరూ కలిసి నల్లగొండకు బస్సులో వచ్చి ఆస్పత్రి ఏరియాలో చిన్న పిల్లలు వారి తల్లిదండ్రులతో ఉండడాన్ని గమనిస్తూ వచ్చారు. తల్లిదండ్రులు లేని సమయం చూసి బాలుడిని కిడ్నాప్ చేసి హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈక్రమంలో బాలుడితో కలిసి భాగ్యలక్ష్మి, పార్వతమ్మ చెట్టుకింద కూర్చొని ఉండగా.. వారితో మాటలు కలిపి వారిని నమ్మించారు. వారు లేని సమయంలో బాలుడిని తీసుకుని పరారయ్యారు.

డబ్బులు ఇవ్వాలని మహిళ బెదిరింపు

- ఇద్దరు వ్యక్తులతో కలిసి యువకుడి ఇంటికి వచ్చి దాడి
- ఇద్దరు పరారు కాగా.. ఒకరిని స్తంభానికి కట్టేసి చితకబాదిన గ్రామస్తులు
- చిలుకూరు మండలం సీత్లాతండాలో ఘటన



నిందితుడిని స్తంభానికి కట్టేసిన గ్రామస్తులు

చిలుకూరు: తనకు డబ్బులు ఇవ్వాలని ఓ మహిళ యువకుడిపై బెదిరింపులకు పాల్పడింది. మంగళవారం రాత్రి సమయంలో ఇద్దరు వ్యక్తులతో కలిసి యువకుడి ఇంటికి చేరుకుని దాడికి దిగింది. అక్కడికి గ్రామస్తులు చేరుకోవడంతో ఇద్దరు పరారు కాగా.. ఒకరిని స్తంభానికి కట్టేసి చితకబాదారు. ఈ ఘటన చిలుకూరు మండలంలోని సీత్లాతండా గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సీత్లాతండాకు చెందిన నూనావత్ సక్రు – మంగమ్మ చిన్న కుమారుడు వినోద్ కారు ట్యాక్సీ డ్రైవర్‌గా పని చేసేవాడు. ఫోన్‌లో తమిళనాడుకు చెందిన మంగా అనే మహిళతో పరిచయం ఏర్పడడంతో ఆమె వద్ద కారు డ్రైవర్‌గా పని చేశాడు. ఈక్రమంలో వారి మధ్య వివాదం రావడంతో వినోద్ ఆమె దగ్గర ఉద్యోగం మానేసి ఇంటికి వచ్చాడు. దీంతో ఆ మహిళ తనకు డబ్బులు ఇవ్వాలని వినోద్‌ను బ్లాక్ మెయిల్‌కు గురి చేస్తోంది. ఈమేరకు 2023 నవంబర్ 13న చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో వినోద్ తల్లి మంగమ్మ ఫిర్యాదు చేసింది. పోలీసులు ఇరువురిని పిలిపించి మాట్లాడి సమస్యను సద్దుమణిగించారు. ఈక్రమంలో సీత్లాతండాలో మంగళవారం రాత్రి గ్రామస్తులు తుల్జాభవానీ పండుగ నిర్వహిస్తుండగా.. తమిళనాడుకు చెందిన మంగా వైరాకు చెందిన ఇద్దరు వ్యక్తులతో కలిసి వినోద్ ఇంటికి వచ్చింది. తమకు డబ్బులు ఇవ్వాలని గొడవ చేసి, వినోద్ తండ్రి సక్రును తలపై కొట్టారు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ దాడిలో వినోద్ తల్లి మంగమ్మకు కూడా గాయాలయ్యాయి. ఈ విషయం గ్రామస్తులకు తెలియడంతో వారు అక్కడకు చేరుకున్నారు. గ్రామస్తులు ముగ్గురిపై దాడి చేశారు. దీంతో అక్కడ ఉన్న మహిళ తో పాటు మరో వ్యక్తి పరారు కాగా.. ఒకరిని విద్యుత్ స్తంభానికి కట్టేసి చితకబాదారు. అనంతరం సక్రు కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అతడిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఉదయం పరారైన మరో వ్యక్తి బుధవారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాడు. ప్రస్తుతం ఇద్దరు పోలీసుల అదుపులో ఉన్నారు. కాగా.. తమను స్తంభానికి కట్టేసి కొట్టారని వారు కూడా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఇరు కేసులపై దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

ఆపదలో ఉన్న కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న కానిస్టేబుల్ నరేష్

మునగాల: ఆపదలో ఉన్న ఓ కుటుంబానికి పోలీసు కానిస్టేబుల్ ఆర్థికసాయం చేసి, వారి సొంతూరికి పంపించి తన సహృదయాన్ని చాటుకున్నాడు. నెల్లూరు జిల్లా కాగుటూరు గ్రామానికి చెందిన దంపతులు మణి– సరోజలు తమ ఇద్దరు చిన్నారులతో జీవనోపాధి నిమిత్తం జనగామ జిల్లాలోని ఓ బొగ్గుల బట్టి వ్యాపారి వద్ద పనికి చేరారు. నెలన్నర రోజుల పాటు పనులు చేయించుకున్న సదరు వ్యాపారి ఆ దంపతులకు ఇవ్వాల్సిన వేతనం ఇవ్వకుండా మోసం చేసి పంపించాడు. ఆ దంపతులు చేతిలో చిల్లిగవ్వ లేక జనగామ నుంచి కాలినడకన జాతీయ రహదారి వెంట నెల్లూరు జిల్లాకు బయలుదేరారు. సూర్యాపేటలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వర్తిస్తున్న మునగాల మండలంలోని విజయరాఘవపురం గ్రామానికి చెందిన మొగిలిచర్ల నరేష్ బుధవారం తన స్వగ్రామం వెళ్తుండగా ఈ దంపతులు కనిపించారు. వారిని చేరదీసి ఇంటికి తీసుకువెళ్లి ఆహారం అందించాడు. వారికి జరిగిన అన్యాయాన్ని తమ గ్రామానికి చెందిన వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశాడు. వారిని ఆదుకునేందుకు రూ.10వేల నగదును సేకరించి ఆ దంపతులకు అందజేశాడు. తమను ఆదుకున్న నరేష్‌కు ఆ దంపతులు కృతజ్ఞతలు తెలిపి స్వగ్రామం బయలుదేరి వెళ్లారు.

మోత్కూరులో చోరీకి యత్నం

- కేకలు వేయడంతో నిందితుడు పరారు
- అతడి బైక్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

మోత్కూరు: మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని పద్మశాలీ కాలనీలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి చోరీకి యత్నించాడు. పద్మశాలీ కాలనీలో ఉంటున్న పోచం అనసూయ రాత్రి సమయంలో ఇంటికి వెనుకవైపు ఉన్న కిటికీ మూసేందుకు వెళ్లింది. అదే సమయంలో ఓ వ్యక్తి ఇంట్లోకి చొరబడేందుకు యత్నించగా ఆమె అప్రమత్తమై కేకలు వేసింది. ఇరుగుపొరుగు వారు రావడంతో దుండగుడు అక్కడి నుంచి పరారయ్యాడు. కాలనీ వాసులు ఇంటి పరిసరాల్లో వెతికినా ఎవరూ కనిపించలేదు. కొద్దిదూరంలో బైక్ కనిపించగా.. దాని యజమాని కనిపించకపోవడంతో 100 నంబర్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకొని, బైక్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ట్రాక్టర్ ట్రాలీ పడి వ్యక్తి మృతి

- ట్రాలీ బేరింగ్‌కు రిపేర్ చేస్తుండగా ఘటన

శాలిగౌరారం: ట్రాక్టర్ ట్రాలీ బేరింగ్‌కు రిపేర్ చేస్తుండగా ప్రమాదశవాత్తు ట్రాలీ మీద పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన శాలిగౌరారం మండలంలోని చిత్తలూరు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తలూరు గ్రామానికి చెందిన గిరగని నరేష్(30) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం తన సొంత ట్రాక్టర్‌పై తుడిమిడి వద్ద గల ఇసుక రీచ్‌కు వెళ్లాడు. ట్రాక్టర్ ట్రాలీలో ఇసుకను నింపుకుని గ్రామానికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో ట్రాక్టర్ ట్రాలీ వీల్ బేరింగ్ దెబ్బతిన్నది. బేరింగ్‌ను మార్చే క్రమంలో నరేష్ జాకీ సాయంతో ట్రాలీని పైకి ఎత్తాడు. ట్రాలీ కిందకు వెళ్లిన నరేష్ దెబ్బతిన్న బేరింగ్ స్థానంలో కొత్త బేరింగ్‌ను అమరుస్తుండగా.. జాకీ ఒక్కసారిగా కిందపడి పోయింది. నరేష్‌పై ట్రాలీ పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నరేష్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు శాలిగౌరారం ఎస్ఐ సైదులు తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం



వెంకన్న(ఫైల్)

నాగారం : సూర్యాపేట – జనగాం జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండల పరిధిలోని నాగారంబంగ్లా గ్రామానికి చెందిన దోమల వెంకన్న(49) నాగారం ఎక్స్‌రోడ్డు వద్ద ఫెర్టిలైజర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి తన బైక్‌పై వర్ధమానుకోట రోడ్డు నుంచి నాగారంబంగ్లాలోని తన ఇంటికి వస్తున్నాడు. అదే సమయంలో సూర్యాపేట నుంచి తిరుమలగిరి వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వెంకన్న తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య దోమల ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ ఐలయ్య తెలిపారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ ఉద్యోగులు



నగదు, బంగారాన్ని అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

దేవరకొండ: ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలు పోగొట్టుకున్న బంగారు చెవి కమ్మలు, కొంత నగదును తిరిగి వారికి అందజేసి బస్సు డ్రైవర్, కండక్టర్ తమ నిజాయితీని చాటుకున్నారు. చింతపల్లి మండలానికి చెందిన మహిళా ప్రయాణికురాలు బుధవారం దేవరకొండ నుంచి సంతోష్‌నగర్‌కు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కింది. సంతోష్‌నగర్ వెళ్లగానే అర్ధ తులం బంగారు చెవి కమ్మలు, కొంత నగదు ఉన్న చిన్న బాక్స్‌ను బస్సులోనే మర్చిపోయి దిగింది. గమనించిన డ్రైవర్ నజీరుద్దీన్, కండక్టర్ దారయాదయ్య ఆ బాక్స్‌ను డిపోలోని అధికారులకు అందజేశారు. డిపో ఏడీసీ ఉపేందర్ విచారణ చేసి సంబంధిత ప్రయాణికురాలి కుటుంబసభ్యులకు దేవరకొండ డిపోలో అందజేశారు.

సాగులో నూతన పద్ధతులు అవలంబించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

రామగిరి(నల్లగొండ): వ్యవసాయంలో నూతన పద్ధతులు అవలంబించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అన్నారు. త్రిపురారం మండలం కంపాసాగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బుధవారం నల్లగొండ మండలంలోని తొరగల్లు గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ రావు యూరియా వినియోగం, సమర్థ సాగు వినియోగం, పంట అవసరాల కొనుగోళ్లలో రసీదులను భద్రపరుచుట, రసాయనాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు చంద్రశేఖర్, రాములమ్మ నూతన వ్యవసాయ పద్ధతులను వివరించారు. పంటల సరళి, జీలుగ, జనుము ఉపయోగాలను మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తెలిపారు. పండ్ల తోటలు, కూరగాయల సాగు లాభాలను ఉద్యాన శాఖ అధికారి అనంతరెడ్డి వివరించారు. కార్యక్రమంలో మత్స్య పరిశ్రమ ఆఫీసర్ కిషోర్, వ్యవసాయ విస్తరణ అధికారి సత్యనారాయణ, అభ్యుదయ రైతులు రామ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలో మహిళ అదృశ్యమైన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. మిర్యాలగూడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన మహిళకు, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామానికి చెందిన కొండ కృష్ణతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. బతుకుదెరువు కోసం వీరు హైదరాబాద్‌కు వెళ్లారు. హైదరాబాద్ నుంచి మహిళ ఈనెల 9న తన తల్లిగారి ఊరైన యాద్గార్‌పల్లికి వచ్చింది. తల్లి పార్వతమ్మ పాత విషయాలను మనసులో పెట్టుకొని కుమార్తెను తిట్టింది. దీంతో మహిళ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా అదే రోజు బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ తెలియరాలేదు. ఆమె భర్త బుధవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయాల వద్ద దరఖాస్తుదారుల నిరీక్షణ



రాజాపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్న దరఖాస్తుదారులు

రాజాపేట: రెవెన్యూ సదస్సుల నిర్వహణలో భాగంగా అధికారులు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుండటంతో కులం, ఆదాయం వంటి ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులు, సంక్షేమ పథకాల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకుందుకు తహసీల్దార్ కార్యాలయాలకు నిత్యం వందల సంఖ్యలో వస్తున్నారు. క్షేత్రస్థాయి విధులకు వెళ్లిన అధికారులు కార్యాలయాల్లో అందుబాటులో ఉండకపోవడంతో దరఖాస్తుదారులు తమ దరఖాస్తులను ఎవరికి ఇవ్వాలో తెలియని పరిస్థితి నెలకొంది.

మునగాలలో వరుసగా రెండు బైక్‌లు చోరీ

మునగాల: కేంద్రంలో వారం రోజుల వ్యవధిలో రెండు బైక్‌లు చోరీకి గురయ్యాయి. నాలుగు రోజుల క్రితం మునగాల మండల కేంద్రంలోని రెడ్డినగర్‌లో వెంకటరెడ్డి తన ఇంటి ఎదుట నిలిపి ఉంచిన బైక్‌ను రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. మంగళవారం రాత్రి జాతీయ రహదారి పక్కన ఓ కిరాణం దుకాణం ఎదుట తోట కోటేశ్వరరావు నిలిపి ఉంచిన బుల్లెట్ వాహనం చోరీకి గురైంది. రెండు బైక్‌ల యజమానులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారం రోజులలోపే రెండు బైక్‌లు చోరీకి గురికావడంతో వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు.

వరిలో విత్తన ఎంపిక అత్యంత కీలకం

- కేవీకే కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు





పాడిపంట

త్రిపురారం : తొలకరి వర్షాలు కురుస్తున్నాయి. రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నారు. నారు మడులకు దుక్కి సిద్ధం చేసుకుంటున్నారు. వానాకాలంలో రైతులు విత్తనాల ఎంపికలో తగిన జాగ్రత్తలు పాటించాలని, వరి పంటల సాగులో విత్తనాల ఎంపిక అత్యంత కీలకమని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పంట చీడపీడలను తట్టుకొని దిగుబడులు పెరిగే రకాలు ఎంపిక చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస రావు పేర్కొంటున్నారు.

మూడు రకాలుగా వరి విత్తనాలు

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసుకోవడానికి అనువైన వరి వంగడాలు మూడు రకాలుగా ఉంటాయి. స్వల్ప, మధ్య, దీర్ఘ కాలిక రకాలుగా లభ్యమవుతాయి. దీర్ఘ కాలిక రకం 150 రోజుల పంట కాలం కాగా జూన్ నెలాఖరు వరకు నాటుకోవాలి. మధ్య కాలిక రకం 135 నుంచి 140 రోజుల పంట కాలం కాగా జూలై 15వ తేదీ వరకు నాటుకోవాలి. స్వల్ప కాలిక రకం 120 నుంచి 125 రోజుల పంట కాలం కాగా జూలై చివరి వరకు నార్లు పోసుకొని 25 రోజుల నారుతో నాట్లు పూర్తి చేసుకోవాలి.

దీర్ఘకాలిక రకాలు :

◆ సాంబ మసూరి (బీపీటీ–5204)
ఈ వరి రకం వంగడం విత్తనాలు 150 రోజుల్లో పంట చేతికి వస్తుంది. చీడ పీడల నివారణ చర్యలు జాగ్రత్తగా తీసుకోవాలి. హెక్టారుకు 65 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

◆ ఇంద్రా (ఎంటీయూ–1061)
ఈ రకం వంగడం 160 రోజుల్లో పంట చేతికి వస్తుంది. హెక్టారుకు 65 నుంచి 70 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

మధ్యకాలిక రకాలు :

◆ కంపాసాగర్ వరి(కేపీఎస్–2874)
ఈ రకం వరి వంగడం 140 రోజుల్లో పంట చేతికి వస్తుంది. సుడిదోమ, అగ్గి తెగులును కొంత మేర తట్టుకుంటుంది. హెక్టారుకు 65 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

◆ సోమనాథ్
ఈ రకం వరి వంగడం130 నుంచి 135 రోజులకు పంట చేతికి వస్తుంది. సన్న రకం గింజ. నారు మడి దశలో చలిని తట్టుకుంటుంది. హెక్టారుకు 65 నుంచి 70 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

◆ వరంగల్ రైస్–1(డబ్ల్యూజీఎల్–915)
ఈ రకం వంగడం 135 రోజుల్లో పంట చేతికి అందుతుంది. వానాకాలం సాగుకు అనువైన ఉత్తమ రకం. హెక్టారుకు 65 నుంచి 70 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

◆ తెలంగాణ వరి–2(డబ్ల్యూజీఎల్–697)
ఈ రకం వరి వంగడం పంటకాలం 135 రోజులు. సన్న గింజ రకం నాణ్యతతో ఉంటుంది. హెక్టారుకు 65 నుంచి 70 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

◆ ఆర్ఎన్ఆర్–11718((రాజేంద్ర నగర్ వరి–1)
135 నుంచి 140 రోజుల పంట కాలం. చౌడు, అగ్గి తెగులు, సుడి దోమ, ఎండు తెగులు, పొట్ట కుళ్లును తట్టుకుంటుంది. హెక్టారుకు 70 నుంచి 80 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది.

◆ జేజీఎల్–27356(జగిత్యాల వరి–3)
130 నుంచి 135 రోజులు పంట కాలం. అతి సన్న గింజ వరి రకం. హెక్టారుకు 70 నుంచి 75 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది.

◆ కేపీఎస్ – 10642 (చిరు సంచి స్థాయి)
పంట కాలం 130 నుంచి 135 రోజులు. చౌడు నేలకు కొంత వరకు అనుకూలం. దిగుబడి ఎకరానికి 32 నుంచి 34 క్వింటాళ్లు వస్తుంది.

స్వల్పకాలిక రకాలు :

◆ తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్–15048)
పంట కాలం 125 రోజులు. అగ్గి తెగులును తట్టుకుంటుంది. హెక్టారుకు 65 కింటాళ్ల దిగుబడి వస్తుంది.

◆ జగిత్యాల సన్నాలు(జేజీఎల్–1798)
ఈ రకం వంగడం పంటకాలం 120 రోజుల్లో చేతికి వస్తుంది. ఉల్లికోడును తట్టుకునే గుణం ఎక్కువగా ఉంటుంది. హెక్టారుకు 70 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

◆ తెలంగాణ వరి–4(జేజీఎల్–25958)
115 నుంచి 120 రోజులకు పంట కోత చేతికి వస్తుంది. హెక్టారుకు 65 నుంచి 70 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

◆ జగిత్యాల రైస్(జేజీఎల్–24423).
120 నుంచి 125 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఉల్లికోడు, సుడిదోమ, గోదుమ రంగు, ఆకుపచ్చ తెగులును కొంత మేర తట్టుకుంటుంది. హెక్టారుకు 85 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

◆ బతుకమ్మ రకం
ఈ రకం వంగడం 115 నుంచి 120 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఎండాకు తెగులు, సడిదోమ, పచ్చదోమ, తట్టుకుంటుంది. హెక్టారుకు 70 నుంచి 80 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

◆ కూనారం వరి–2(కేఎన్ఎం–1638)
ఈ రకం వరి వంగడం120 నుంచి 125 రోజుల్లో పంట కోతకు వస్తుంది. హెక్టారుకు 76 నుంచి 85 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

◆ ఆర్ఎన్ఆర్–21278 (రాజేంద్ర నగర్ వరి–4)
115 నుంచి 118 రోజులు పంట కాలం. సన్న గింజ, పొట్టి గింజ రకం. హెక్టారుకు 60 నుంచి 70 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది.

◆ ఆర్ఎన్ఆర్–29325(రాజేంద్ర నగర్ వరి–5)
120 నుంచి 125 రోజులు పంట కాలం. సుడి దోమ, చౌడును తట్టుకుంటుంది. హెక్టారుకు 70 నుంచి 80 క్వింటాళ్ల దిగుబడునిస్తుంది.

◆ కేఎన్ఎమ్–1638(కూనారం రవి–1)
125 నుంచి 130 రోజులు పంట కాలం. ఉల్లికోడు, అగ్గి తెగులును తట్టుకుంటుంది. హెక్టారుకు 70 నుంచి 80 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

◆ కేఎన్ఎమ్–118(కూనారం సన్నాలు)
125 రోజులు పంట కాలం. పంటపై గింజ రాలె శాతం తక్కువ. హెక్టారుకు 70 నుంచి 80 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

◆ జేజీఎల్–24423(జగిత్యాల రైస్–1)
125 రోజుల పంట కాలం. సుడి దోమ, చలి, చౌడును కొంత వరకు తట్టుకుంటుంది. హెక్టారుకు 70 నుంచి 82 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

◆ కెపీఎస్–6251(పీఆర్‌సీ)
పంట కాలం 115 నుంచి 120 రోజులు. అగ్గి తెగులు, ఆకు ఎండు తెగులు, సుడి దోమను కొంత వరకు తట్టుకుంటుంది. ఎకరానికి 32 నుంచి 34 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

◆ కేపీఎస్–10329(చిరు సంచి స్థాయి)
వానాకాలం 120 నుంచి 125 రోజులు, యాసంగి 130 నుంచి 135 రోజుల పంట కాలం. దిగుబడి ఎకరానికి 32 నుంచి 34 క్వింటాళ్లు వస్తుంది.

◆ కేపీఎస్–10631 (చిరు సంచి స్థాయి)
వానాకాలంలో 120 నుంచి 125 రోజులు, యాసంగిలో 130 నుంచి 135 రోజులు. దిగుబడి 32 నుంచి 34 క్వింటాళ్లు వస్తుంది.